
సాక్షి
బాపట్ల
బుధవారం : 25 : డిసెంబర్ : 2024



ఉపాధి హామీ పనుల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): శివాపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి మంగళవారం పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 575.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,717 క్యూసెక్కులు విడుదలవుతోంది.

పాండురంగడి అలంకరణ



సత్తెనపల్లి: ధనుర్మాసం సందర్భంగా స్థానిక అలివేలుమంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి గుడిలో స్వామిని మంగళవారం పాండురంగడిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ప్రార్థనా మందిరాల వద్ద పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ



బాపట్లటౌన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని జిల్లాలోని ప్రార్ధనా మందిరాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి ప్రార్ధనలు ప్రారంభం కానున్న దృష్ట్యా పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ పండుగను జరుపుకోవడానికి పోలీస్ శాఖ తగిన రక్షణ చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి సంతోషకరమైన వాతావరణంలో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలన్నారు. వాహనాలు నడిపేవారు మద్యం సేవించరాదని అన్నారు. ప్రమాదకరరీతిలో, ఇతరులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా వాహనాలు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అనంతరం క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి



బాపట్లటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లాలోని అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అవగాహనకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లోని వి.సి హాలులో జిల్లా అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన అర్జీలు, ప్రత్యేకంగా నిర్వహించే జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చే అర్జీలు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను పి.జి.ఆర్.ఎస్ పోర్టల్‌లో నమోదు చేస్తామని అన్నారు. జిల్లాలో 29 శాఖలకు సంబంధించి అధికారులకు ఫిర్యాదుల పరిష్కారంకు లాగిన్ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఫిర్యాదులు గ్రామ, మండల, జిల్లా స్థాయి ఉంటాయని తెలిపారు. జిల్లా అధికారులు ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. ఫిర్యాదులను సరైన కారణాలు చూపకుండా తిరస్కరిస్తున్నారని అన్నారు. ఆ ఫిర్యాదులు మరల పునరావృతం అవుతున్నాయన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, ఆడిటింగ్, పెండింగ్, ఫోన్ కాల్స్, ప్రజల సంతృప్తి, అసంతృప్తి పై తీసుకోవాల్సిన చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, బాపట్ల మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు, పాల్గొన్నారు.

కొండపై గండాలయ్య విగ్రహం ఏర్పాటుపై సమీక్ష



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి గండాలయ్య స్వామి గుడి అభివృద్ధిపై మంగళవారం కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యాలయంలో మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, గండాలయ్య స్వామి అఖండ జ్యోతి ప్రాంతాలను పవర్ ప్రజంటేషన్ ద్వారా ఆమె వీక్షించారు. మంగళగిరి కొండపై గండాలయ్య స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నరసింహస్వామి సన్నిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె అడిగి తెలుసుకున్నారు. గండాలయ్య స్వామి విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు ముఖ మండపాలు, మెట్లమార్గం అభివృద్ధి, పార్కింగ్ వసతిపై కమిషనర్ అలీమ్‌బాషాతో చర్చించి ఆ పనులను వెంటనే అమలు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

'క్రిస్మస్' కాంతులు



బాపట్లలోని సీబీజడ్ చర్చి



విద్యుత్ వెలుగుల్లో కోనంకి తెలుగు బాప్టిస్ట్ చర్చి



రేపల్లెలోని సెయింట్ మేరీస్ చర్చి



చీరాల హయ్యర్‌పేటలో రోడ్డుపై వేసిన 50 అడుగుల విద్యుత్ ప్రతిమలు

క్రిస్మస్ కాంతులతో బాపట్ల జిల్లాలోని చర్చిలు వెలిగిపోతున్నాయి. పలు చర్చిలు, క్రైస్తవుల ఇళ్లు విద్యుద్దీప శోభతో కళకళలాడుతున్నాయి. బాపట్ల, రేపల్లె, చీరాల, పర్చూరు ప్రాంతాల్లోని పురాతన చర్చిలు ప్రత్యేక అలంకరణతో ధగధగలాడుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి చర్చిలలో ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

–సాక్షి, నెట్ వర్క్

వర్షార్పణం

- మరో రెండు రోజులు వర్షాలు
- తడిసిన ఓదెలు
- కల్లాల్లోనే ధాన్యం
- పంట కాపాడుకునే పనిలో ఉరుకులు పరుగులు
- దిక్కుతోచని స్థితిలో రైతులు



చింతావారిపాలెంలో ధాన్యం రాసులపై పట్టలు కప్పిన దృశ్యం (ఇన్‌సెట్లో) వల్లువారిపాలెంలో తడిచిన ధాన్యం

బాపట్లటౌన్: మరి కొద్ది రోజుల్లో పంట చేతికొస్తుందన్న రైతుల ఆనందాన్ని వర్షం నీరుగార్చింది. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పొలాల్లో ఉన్న ధాన్యం రాసులు తడిసి ముద్దయయ్యాయి. ఓదెలు నీట మునిగాయి. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో రైతులు పంట కాపాడుకునే చర్యలు చేపట్టారు. కోతకు వచ్చిన పంటను కోసి నూర్పిళ్లు చేశారు. ధాన్యం రోడ్లపై ఆరబెట్టారు. పొలాల్లో ఉన్న ఓదెలను కట్టలు కట్టి కుప్పలు వేశారు. ఒక్కసారిగా ఒత్తిడి పెరగడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. రైతులపై ఆర్థిక భారం పడింది. అయినా సరే పంటను కాపాడుకునే ఆలోచనతో అప్పులు చేసి మరీ భారాన్ని భరించారు. అల్పపీడనం గండం తప్పింది అనుకుంటున్న తరుణంలో మంగళవారం కురిసిన వర్షానికి రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. ధాన్యం రాసులపై పట్టలు కప్పి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నించారు. పొలాల్లో ఉన్న ఓదెలు నీట మునిగాయి. ఇప్పటికే ధాన్యం రాసులుగా చేసిన ఉన్న ధాన్యం, ఓదెలపై ఉన్న పైర్లకు చిన్నపాటి జల్లులు పడినా గింజలు రంగుమారి, ధాన్యం మొలకెత్తుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో వర్షపాతం ఇలా..

సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు జిల్లాలో 78.2 మి.మీ వర్షపాతం నమోదైంది. చీరాలలో అత్యధికంగా 11.4 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అమర్తలూరులో 11, భట్టిప్రోలులో 9.4, రేపల్లెలో 7.6, నగరం 5.2, నిజాంపట్నం 4.2, పిట్టలవానిపాలెంలో 5.4, చెరుకుపల్లిలో 5.2, కొల్లూరు 4.8, వేమూరులో 4.2, బాపట్లలో 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

వర్షాలతో తీవ్ర నష్టం



ఈ ఏడాది ఆదినుంచి కష్టాలే వెంటాడుతున్నాయి. నాట్లు వేసిన 20 రోజుల వరకు పొలాలకు నీరు లేక ఎండిపోతుంటే వాటిని కాపాడేందుకు వేలకు వేలు ఖర్చుచేసి కాపాడుకున్నాం. ఆ తర్వాత వరుసగా వచ్చిన తుపాన్లకు పొలాలు మునిగిపోయాయి. వేలకువేలు చెల్లించి నార్లు కొనుగోలు చేసి నాట్లు వేసుకున్నాం. పంట ఈనే దశలో ఉన్నప్పుడు అక్టోబర్‌లో కురిసిన వర్షానికి గింజ తాలుగా మారింది. నవంబర్‌లో వచ్చిన వర్షానికి గింజ మొత్తం రాలిపోయింది. ప్రస్తుతం కురిసిన వర్షం ఓదెలపై నీళ్లు చల్లింది.

–పందరబోయిన వెంకటేశ్వర్లు, వెస్ట్ పిన్నిబోయినవారిపాలెం

పంట చేతికి వస్తుందో రాదో..



నేను ఇప్పటికే రెండు ఎకరాలు కోత కోశాను. పంట ఓదెలపై ఉంది. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పంట మొత్తం తడిసింది. తడిచిన పంట కట్టివేత వేయటానికి కూడా లేదు. మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు. ఇప్పటికే రూ.25 వేలు ఖర్చుపెట్టాం. అసలు పండించిన పంట చేతికి వస్తుందో..రాదో అని భయంగా ఉంది.

–పమిడిబోయిన రాముడు, ముత్తాయపాలెం

కంటి మీద కునుకు లేదు



ఈ ఏడాది సాగు చేపట్టిన దగ్గర నుంచి కంటి మీద కునుకు లేదు. వెద పెట్టిన 20 రోజుల వ్యవధిలో కురిసిన వర్షానికి పొలం మొత్తం పూర్తిగా నీటమునిగిపోయింది. సెంటు నారు రూ.1500 చొప్పున నాలుగు సెంట్లు రూ.6వేలు ఖర్చు చేసి మరోసారి నాటు వేయించాను. నాట్లు వేసిన వారం రోజుల వ్యవధిలో కురిసిన వర్షానికి మరోసారి పంట ముంపునకు గురై పూర్తిగా దెబ్బతింది. కనీసం ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం అందలేదు. అప్పు చేసి మరోసారి పంట సాగు చేశా. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆందోళనగా ఉంది.

–పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, ముత్తాయపాలెం

సమైక్యంగా సమరనాదం

- చుండూరు మండలంలో ఏకతాటిపైకి వైఎస్సార్ సీపీ నేతలు
- గతంలో గ్రూపులతో బలహీనపడిన పార్టీ
- కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు
- అశోక్‌బాబు చొరవతో వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో పార్టీ వర్గాల ఐక్యనినాదం



వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో చుండూరు మండల పార్టీ నేతలు

చుండూరు(తెనాలి): బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలంలోని వైఎస్సార్ సీపీ నేతలు ఏకతాటిపైకి వచ్చారు. సమైక్యంగా సమరనాదం మోగించారు. కలిసుంటే కలదు జయమని నినదించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో మంగళవారం తాడేపల్లి వెళ్లి పార్టీ ఉమ్మడి గుంటూరుజిల్లా పరిశీలకుడు వైవీ సుబ్బారెడ్డిని కలిశారు. ఐక్య నినాదం వినిపించారు.

తొలి నుంచీ వైఎస్సార్‌సీపీకి కంచుకోట

చుండూరు మండలం వైఎస్సార్ సీపీకి తొలి నుంచి కంచుకోట. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచిన డాక్టర్ మేరుగ నాగార్జునకు ఈ మండలంలో 4,800 ఓట్ల ఆధిక్యత లభించింది. తర్వాత జరిగిన పంచాయతీలు, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థులు, మద్దతునిచ్చినవారే ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం వర్గవిభేదాలు పొడచూపాయి. నేతలు గ్రూపులుగా విడిపోయారు. ఈ పరిణామం 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపింది. మండలంలో మెజార్టీ 600కు పడిపోయింది. దీంతో పార్టీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఓటమి పాలయ్యారు. వైఎస్సార్‌సీపీ నేతలు వర్గాలుగా విడిపోవడంతో కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నేతలు రెచ్చిపోయారు. శ్రేణులపై దాడులకు దిగారు. కేసులు పెట్టేలా పోలీసులను పురిగొల్పారు.

అశోక్‌బాబు చొరవతో మళ్లీ ఏకమై

చుండూరు మండలంలో పార్టీ బలహీనపడడానికి గ్రూపు విభేదాలే కారణమని గ్రహించిన నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు నేతల మధ్య సయోధ్యకు చొరవ చూపారు. మండల విస్తృత సమావేశాన్ని ఇటీవల నిర్వహించారు. క్యాడర్ ఇబ్బందులను చర్చించారు. అందరూ ఒకటి కావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.


ఏకాభిప్రాయాన్ని సాధించారు. పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన అభయం ఇప్పించాలని తలపోశారు. కూటమి అధికారంలోకి రాగానే పార్టీ క్యాడర్‌పై దాడులు, అక్రమ కేసులు వంటి చిల్లరపనులకు దిగిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబే వైఎస్సార్ సీపీని మళ్లీ బలోపేతమయ్యేలా చేశాయని అశోక్‌బాబు అభివర్ణించడం విశేషం. అశోక్‌బాబు గ్రామగ్రామాన పర్యటించి అందరి అంగీకారంతో గ్రామ కమిటీలను నియమించారు.

గొప్ప ముందడుగు

వైఎస్సార్ సీపీ నేతలు వర్గవిభేదాలు వీడి మళ్లీ ఏకతాటిపైకి రావడం గొప్ప ముందడుగు. ఇకపై కూటమి అరాచకాలను సహించేది లేదని, సమష్టిగా సమరనాదం పూరిస్తామని నాయకులంతా ఐక్యంగా నినదించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిశీలకుడు, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కలిసి ఇకపై పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అంతా కలుసుండాలని, పార్టీ అండగా ఉంటుందని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో చుండూరు ఎంపీపీ జాలాది రూబేను, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అన్నపరెడ్డి రఘురామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ వుయ్యూరు అప్పిరెడ్డి, జాలాది రమేష్, దాట్ల మోహన్‌రెడ్డి, అన్నపరెడ్డి వీరారెడ్డి, ఈమని వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక దందాతో తాగునీటికి కటకట

- జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన యానాదులు
- వేటపాలెం ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా
- బాపట్ల, ప్రకాశం, పల్నాడు, హైదరాబాద్‌కు తరలింపు
- తవ్వకాలు ఆపాలని పలుమార్లు కాలనీ వాసుల వినతి
- తాగు నీటికి ఇబ్బందులు వస్తాయని వేడుకోలు
- జిల్లా, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం నిల్
- అధికార పార్టీ నేతలకే మద్దతు పలికిన అధికారులు
- మాపైనే ఫిర్యాదు చేస్తారా.. అంటూ బెదిరింపులు



పుల్లరిపాలెం సాయి ఎస్టీ కాలనీ



రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్టీ కమిషన్ లేఖ

సాక్షి ప్రతినిధి, బాపట్ల : బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల ఇసుక దందా వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర సరిహద్దులు దాటి ఏకంగా జాతీయ స్థాయికి చేరింది. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటాయని, తాగునీటికి కటకట తప్పదని వేటపాలెం మండలం పుల్లరిపాలెంలోని సాయి ఎస్టీ కాలనీ వాసులు యానాది హక్కుల పరిరక్షణ సంఘం పేరున నవంబర్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. 'రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఎస్టీ కాలనీ సమీపంలోని ఇసుక దిబ్బల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పరిసర ప్రాంతాల్లోని అసైన్డ్ భూముల్లో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉండడంతో తవ్వకాల వ్యవహారాన్ని హైదరాబాద్‌కు చెందిన కొందరికి అప్పగించారు. ఈ వ్యవహారంలో స్థానిక నేతకు పెద్దఎత్తున ముడుపులు ముడుతున్నట్లు సమాచారం. వేటపాలెం ప్రాంతం నుంచి బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలతోపాటు హైదరాబాద్‌కు సైతం ఇసుక భారీగా తరలిపోతోం'దని వారు వివరించారు. ఈ విషయమై తక్షణం విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్టీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు అందాయి. అయితే అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్న అధికారులు నవంబర్ 27న తొలి విచారణ సందర్భంగా బాధితులనే బెదిరించారు. ఈ విషయమై ఎస్టీలు మరోమారు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తహసీల్దార్, పోలీసు, ఇతర అధికారులతో కూడిన బృందం ద్వారా వీడియో రికార్డింగ్ చేస్తూ విచారించాలని ఆదేశించింది. కాగా, తాము చెప్పినట్లు విచారణలో చెప్పాలని, ఇక్కడ ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగడం లేదని అధికారులు రాసిన పేపర్లలో సంతకాలు పెట్టాలని అధికార పార్టీ నేతలు.. ఎస్టీలను బెదిరించినట్లు సమాచారం. మాపైనే ఫిర్యాదు చేస్తారా.. అని అధికారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తాము న్యాయవాదిని నియమించుకుని సమాధానం ఇస్తామని శుక్రవారం విచారణకు వచ్చిన అధికారులకు బాధితులు తేల్చి చెప్పారు.



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ప్రాంతం

మామూళ్ల మత్తులో అధికారులు!

వేటపాలెం ప్రాంతంలో ఇప్పటికే కనుచూపు మేర రొయ్యల చెరువులు వెలిసి, కెమికల్స్ ప్రభావంతో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, ఇప్పుడు ఇసుక తవ్వకాల వల్ల వేసవిలో తాగునీటి కోసం తమ కుటుంబాలకు ఇబ్బందులు తప్పవని యానాది హక్కుల పరిరక్షణ సంఘం ప్రెసిడెంట్ ఇండ్ల స్వాతి, సెక్రటరి పోలయ్య, కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ విషయమై మండల, జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. అయినా కొందరు అధికారులు ఇసుక మాఫియా నుంచి నెల మామూళ్లు పుచ్చుకుంటుండటంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని సమాచారం.



నవంబర్ 27న ఆర్‌డీఓ, తహసీల్దార్ విచారణ సందర్భంగా ఎస్టీలను బెదిరిస్తున్న టీడీపీ నేతలు



ఎస్టీ కాలనీ పరిసరాల్లోని రొయ్యల చెరువులు

మున్సిపల్ పాఠశాలల్లో 18 మందికి ఉద్యోగోన్నతులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని నగరపాలకసంస్థ, పురపాలక పాఠశాలల్లో 18 మంది ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం డీఈఓ సీవీ రేణుక అధ్యక్షతన గుంటూరు నగరపాలకసంస్థతో పాటు వివిధ మున్సిపాలిటీల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ ద్వారా స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తెలుగు-3, హిందీ-2, ఇంగ్లిషు-3, సోషల్-5, భౌతికశాస్త్రం-1, జీవశాస్త్రం-2, గణితం-2 పోస్టులను భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డీసీఈబీ కార్యదర్శి ఎ. తిరుమలేష్, సీనియర్ హెచ్‌ఎంలు జె.రమేష్ కుమార్, గుంటూరు తూర్పు ఎంఈవో-1 అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నానో డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన



చీరాల అర్బన్: కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంకొల్లులో కోరమాండల్ నూతన ఉత్పత్తి అయిన నానో డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎరువుల యాజమాన్యం గురించి కోరమాండల్ కంపెనీ ఆర్‌బీహెచ్ కేఎస్ఆర్ చక్రవర్తి హాజరై మాట్లాడారు. సేంద్రియ ఎరువు మట్టి పరీక్షలు గ్రోమోర్ న్యూట్రిక్లినిక్ సేవలు, గ్రోమోర్ ఉత్పత్తుల ప్రాముఖ్యత, నానో డీఏపీ విశిష్టత, డ్రోన్ సేవలు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమానికి 600 మంది రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అగ్రోనామిస్ట్ మోహన్, జోనల్ మేనేజర్ శ్రీహరి, నానో డీఏపీ మేనేజర్ స్వరూప్, సీనియర్ అగ్రోనామిస్ట్ తిరుపతిరావు, జూనియర్ అగ్రోనామిస్ట్ వెంకటేష్, లోకల్ మార్కెటింగ్ ఆఫీసర్ హుస్సేన్, రజాన్, హరినాథరెడ్డి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



చీరాల: చీరాల రామ్‌నగర్‌లోని ఆర్టీసీ గ్యారేజి వెనుక పరిసర ప్రాంతాలలో నాటుసారా తయారీకి ఉపయోగించే 400 లీటర్ల బెల్లం ఊటను మంగళవారం ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు జిల్లా ఏఈఎస్, ఇఎస్‌టీఎఫ్ బాపట్ల, చీరాల ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం రామ్‌నగర్‌లోని చర్చి వెనుక గల పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారు చేయుటకు ఉపయోగించేందుకు డ్రమ్ములలో సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.

దుర్గగుడికి పోటెత్తిన భవానీలు

- నాలుగో రోజు రికార్డు స్థాయిలో దీక్షల విరమణ
- దీక్షలు విరమించిన 85 వేల మంది భవానీలు
- నేడు పూర్ణాహుతితో దీక్షలు పరిసమాప్తం



కొండ దిగువన అర్జున వీధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీమాలధారులు దుర్గగుడికి పోటెత్తారు. దుర్గమ్మ సన్నిధిలో దీక్షలు విరమించేందుకు తమిళనాడు, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు రికార్డు స్థాయిలో 85 వేల మంది భవానీలు దీక్షలను విరమించారు. సోమవారం రాత్రి గిరి ప్రదక్షిణ పూర్తిచేసుకున్న భవానీలు అర్ధరాత్రికే క్యూలైన్లలోకి చేరుకుని దర్శనం కోసం వేచి ఉన్నారు. భవానీల రద్దీ అధికం కావడంతో మంగళవారం తెల్లవారుజామున రెండు గంటలకే అమ్మవారి దర్శనం కల్పించారు. ఇరుముడులు సమర్పించే కౌంటర్లు, హోమగుండాలు, కనకదుర్గనగర్ ఇలా ఎక్కడ చూసినా భవానీలే కనిపించారు.



మహా మండపం ఆరో అంతస్తులో దుర్గమ్మ ఉత్సవమూర్తి

వర్షంతో ఇక్కట్లు

మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కురిసిన వర్షంతో దీక్ష విరమణలకు విచ్చేసిన భవానీలు ఇబ్బందులకు గురయ్యారు. గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీలకు ఎక్కడా వేచి ఉండేందుకు ఏర్పాట్లు లేకపోవడంతో వర్షం, చలిగాలులతో వణికిపోయారు. ఈ నెల 21వ తేదీన ప్రారంభమైన భవానీ దీక్షల విరమణ బుధవారం ఉదయం 11 గంటలకు యాగశాలలో జరిగే మహా పూర్ణాహుతితో పరిసమాప్తమవుతుందని ఆలయ వైదిక కమిటీ పేర్కొంది.

మరో మారు మూలవిరాట్ వీడియో కలకలం

భవానీ దీక్షల విరమణ మహోత్సవ వేళ మంగళవారం ఇంద్రకీలాద్రిపై మరోమారు వీడియో కలకలం సృష్టించింది. అమ్మవారిని దర్శించుకునేందుకు హైదరాబాద్, బళ్లారి నుంచి విచ్చేసిన వేరు వేరు కుటుంబాలు అంతరాలయ వీడియోను తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఏకంగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా అమ్మవారి మూల విరాట్‌ను అత్యంత దగ్గరగా వీడియో తీయడాన్ని ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. దీంతో వెంటనే ఆ రెండు కుటుంబాల వద్ద నుంచి ఫోన్లను స్వాధీనం చేసుకుని, విషయాన్ని డీఈఓ రత్నరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆ ఇరు కుటుంబాలను విచారణ చేపట్టి, వారు తీసిన వీడియోలను ఫోన్ల నుంచి తొలగించారు. వీడియోను మళ్లీ రికవరీ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించి పంపేశారు.

కీలక విభాగాల్లో ఈఓ తనిఖీలు

లడ్డూ ప్రసాదాల తయారీ పోటు, అన్న ప్రసాదం తయారీ, ప్రసాద వితరణ, లడ్డూ విక్రయ కౌంటర్లు, హోమగుండాలతో పాటు ఇరుముడి పాయింట్లను ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి భవానీల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంటుందని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు. ఏడు లక్షలకు పైగా లడ్డూలు సిద్ధంగా ఉన్నాయని, భక్తులు ఎన్ని అడిగినా ఇవ్వాలని సూచించారు.



దీక్షల విరమణకు తరలివస్తున్న భవానీలు

వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌గా మర్రెడ్డి ప్రమాణం

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌గా మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. తాడేపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హాజరై శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, యార్లగడ్డ వెంకటరావు పాల్గొన్నారు.



శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సవిత

యార్డుకు 76,386 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు):గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 76,386 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 73,529 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది.

వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్లటౌన్: వినియోగదారుల హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులు తమ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వినియోగదారులు అమ్మకాలు, కొనుగోలులో ఇబ్బందులు తలెత్తితే వినియోగదారుల ఫోరం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రభుత్వం వినియోగదారుల శ్రేయస్సు కోసం న్యాయస్థానాల్లో వర్చువల్ విచారణ, డిజిటల్ సౌలభ్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనివల్ల వినియోగదారులకు వ్యయప్రయాసలకు గురికాకుండా సులభతరంగా ప్రయోజనాలను పొందవచ్చన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా కాలేజీ, స్కూల్ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు, క్యాష్ ప్రైజ్‌లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి విలియమ్స్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తమ్, బాపట్ల వినియోగదారుల సంఘం కార్యదర్శి పి.సి.సాయిబాబు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

రాష్ట్రస్థాయి పోటీల్లో పమిడిపాడు ఎడ్ల ప్రతిభ

- స్వర్ణలో జూనియర్ ఎడ్ల బండి పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న జనం

కారంచేడు: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. మండలంలోని స్వర్ణ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండి పరుగు పోటీల్లో బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. నిర్వాహకుల వివరాల మేరకు.. స్వర్ణ గ్రామ ఎస్సీ కాలనీ వాసులు మేరీమాత ఆశీస్సులతో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మైసూరు ఎద్దుల టైరు బండి పరుగు పందేలు (జూనియర్ విభాగంలో) నిర్వహించారు. పోటీల్లో మొత్తం 25 జతల ఎడ్లు వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యాయి. స్వర్ణ–దగ్గుబాడు రోడ్డులో 1.5 కిలోమీటర్ల దూరాన్ని బండితో తక్కువ సమయంలో ఛేదించిన ఎడ్లకు స్థానాలను బట్టి బహుమతులు అందించారు. దీనిలో పమిడిపాడుకు చెందిన నల్లమోతు సాయి హర్ష ఎడ్ల జత 4.44.99 నిమిషాల్లో లక్ష్యాన్ని సాధించి ప్రథమ స్థానంలో నిలిచి రూ.20 వేలు గెలుపొందింది. బాపట్ల మండలం చెరువు జమ్ములపాలేనికి చెందిన పార్వతీదేవి అమ్మవారి ఎడ్ల జత 4.52.45 నిమిషాల్లో లాగి రెండో స్థానంలో నిలిచింది. రూ.15 వేలు గెలుచుకుంది. స్వర్ణ గ్రామానికి చెందిన దుర్గారావు ఎడ్ల జత 4.57.61 నిమిషాల్లో గమ్యాన్ని చేరి మూడో స్థానంలో నిలిచింది. ఈ ఎడ్లకు రూ.10 వేలు బహుమతి అందించారు. నెల్లూరు జిల్లా కొవ్వూరు గ్రామానికి చెందిన చెన్నకేశవస్వామి ఎడ్ల జత 5.10.13 నిమిషాల్లో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఎడ్లకు రూ.5 వేల బహుమతులు అందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా గవిని కృష్ణ, హైస్కూల్ పీడీ కట్టా ప్రసాద్, ఎస్ఆర్‌కే ప్రసాద్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాకులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు.



రాష్ట్రస్థాయి మైసూరు ఎద్దుల బండి పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత



విజేతకు మొదటి బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

ఎట్టకేలకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

సాక్షి కథనంతో కదిలిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్

కారెంపూడి: మండలంలో ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం మంగళవారం ప్రారంభించింది. పేట సన్నెగండ్ల గ్రామంలో పీపీసీ సెంటర్ ద్వారా తొలి రోజు 150 క్వింటాళ్ల బీపీటీ 5204 రకం ధాన్యాన్ని కొన్నారు. 75 కిలోల బస్తా రూ.1,700కు కొనుగోలు చేశారు. ధాన్యాన్ని తనిఖీ చేసి 17 శాతం లోపు తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 'ధాన్యం..దైన్యం' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా జాయింట్ కలెక్టర్ గానోర్ సూరజ్ ధనుంజయ్ స్పందించారు. తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు వెంటనే స్పందించి హుటాహుటిన పేటసన్నెగండ్లలో ఉన్న పీపీసీ సెంటర్ ద్వారా కొనుగోళ్లు వెంటనే ప్రారంభించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా రైతులకు ధాన్యం కొనుగోళ్ల సమాచారం అందించారు. పిడుగురాళ్ల ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ బి.యలమందారెడ్డి పర్యవేక్షణలో పీపీసీ సెంటర్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు. ఆరబెట్టి బస్తాలలో నిల్వ ఉంచుకున్న రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకు వచ్చి అమ్ముకున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ధాన్యం రేటు కూడా బస్తా రూ.1,700కు కొనడంతో మిగిలిన రైతుల్లో కూడా ధాన్యం అమ్ముకోవచ్చనే ఆశలు చిగురించాయి. రైతులందరూ ధాన్యం ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.



పీపీసీ సెంటర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ యలమందారెడ్డి

27, 28 తేదీల్లో పౌరాణిక నాటక ప్రదర్శనలు

నగరంపాలెం(గుంటూరు పశ్చిమ): ఈనెల 27, 28 తేదీల్లో మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విజ్ఞాన మందిరంలో నాటక ప్రదర్శనల వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సంఘం 28వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండు రోజులు ప్రదర్శనలు జరుగుతాయని అన్నారు. తొలి రోజు సాయంత్రం శ్రీరామాంజనేయ యుద్ధం (వార్‌సీను), మయసభ (దుర్యోధన ఏకపాత్ర), చింతామణి – భవాని సీను, పల్నాటి యుద్ధం (సీను), సత్యహరిశ్చంద్ర (అడవి సీను), రెండో రోజు పాండవోద్యోగం నుంచి (యుధిష్ఠిర ఏకపాత్ర), బాలనాగమ్మ (పకీరు సీను), రాజనర్తకి (ముఖ్యమైన సన్నివేశాలు), మయసభ దుర్యోధన ఏకపాత్ర, శ్రీకృష్ణ రాయబారం (సెంట్రల్ సీను), సత్యహరిశ్చంద్ర (అడవి సీను కాటి సీను వరకు) ప్రదర్శించనున్నట్లు తెలిపారు. డాక్టర్ ఎం.ఫర్నికుమార్ నిర్వహణలో పాత సినీ గీతాలాపన ఉందన్నారు. కళాభిమానులు, నాటక కళాకారులు హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చెన్నుపాటి కృష్ణారావు, సనిశెట్టి సాంబశివరావు, డాక్టర్ బీవీ.రమణ, శ్రీకాంత్, సూర్యనారాయణ, వెంకటప్పయ్య, అర్జునరావు, దర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలు అరికట్టేందుకు అధికారులందరూ సమష్టి కృషితో, ప్రణాళికతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్‌సీఓఆర్‌డీ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీ అడిక్షన్ సెంటర్‌లలో మాదక ద్రవ్యాలు వినియోగించి చికిత్స కోసం వచ్చే రోగుల వివరాలు పోలీసులకు అందించాలన్నారు. విద్యాసంస్థలు, పరిసర ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టేందుకు స్థానికులకు అవగాహనతో పాటు పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు కలిపి పాఠశాలల్లో నార్కోటింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణ కోసం సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మెడికల్ షాపుల్లో వైద్యుల సిఫార్సు లేకుండా మత్తు కలిగించే డ్రగ్స్ విక్రయించరాదని తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల క్రయ, విక్రయాలను కఠినంగా అణచి వేస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించేవారితోపాటు, విక్రయించేవారితో కూడా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. డీఈఓ రేణుక, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ మహబూబ్ షరీఫ్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విజయలక్ష్మి, ఫుడ్ కంట్రోల్ ఏడీ లక్ష్మణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో క్రిస్మస్ వేడుకలు



పోలీసులతో మాట్లాడుతున్న సీఐలు రవీంద్రబాబు, వాసు, నాగుల్‌మీరా



ఆలయంలో ఏర్పాటుచేసిన పశువుల పాక

ఫిరంగిపురం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిరంగిపురం బాల ఏసుదేవాలయ ప్రాంగణంలో మంగళవారం అర్ధరాత్రి నిర్వహించాల్సిన వేడుకలను వర్షం వల్ల ఆలయంలో నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌర్యమూ కలుగకుండా ఉండేలా రాత్రి 11.30 గంటల నుంచి దివ్యపూజాబలి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనిపై బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి , గుడి పెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు జరగనున్నాయి. ఆలయంలో క్రీస్తు జననాన్ని తెలియజేసేలా పశువుల పాకను అందంగా అలంకరించారు. పాక చుట్టూ విద్యుదీపాలు, నీటి కొలను సెట్టింగ్ ఏర్పాటు చేశారు.

తిరునాళ్లకు పటిష్ట భద్రత

క్రిస్మస్ సందర్భంగా గ్రామంలో నిర్వహించే బాలఏసు ఆలయ తిరునాళ్లకు 138 మందితో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు. సెయింట్‌పాల్స్ ఆడిటోరియంలో మంగళవారం పోలీసు సిబ్బందికి విధులు కేటాయించారు. తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పలు స్టేషన్ల నుంచి వచ్చిన పోలీసులకు అవగాహన కల్పించారు. భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. వాహనాల పార్కింగుకు మూడు ప్రాంతాలను నిర్ణయించినట్టు పోలీసులు వివరించారు. తేర్ల ఉత్సవానికి పకడ్బందీ చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. తాడికొండ సీఐ వాసు, మేడికొండూరు సీఐ నాగూల్ మీరా పాల్గొన్నారు.

27న వాలీబాల్ రాష్ట్రజట్టు ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి సీనియర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పురుషుల, మహిళల జట్టు ఎంపిక పోటీలను ఈనెల 27వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు పల్నాడు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపికైన జట్లు జనవరి 7వ తేదీ నుంచి 13 వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరగనున్న జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 7 గంటలకు విజయవాడ స్టేడియంకు హాజరు కావాలని కోరారు.

కాల్వలో దూకి జంట ఆత్మహత్యాయత్నం

ఒకరు మృతి... మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైనం

బొల్లాపల్లి: నాగార్జున సాగర్ కుడి కాలువలో ఓ జంట దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం జరిగింది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు వినుకొండ పట్టణంలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా వెల్లటూరు గ్రామానికి చెందిన గోవిందు నాగరాజు (41), వినుకొండ పట్టణంలో నివాసం ఉంటున్న వి.భార్గవి వివాహేతర సంబంధం నేపథ్యంలో విడిపోతామని మనస్థాపానికి గురై వెల్లటూరు సమీపంలోని బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించారు. ఇది గమనించిన స్థానికులు కాలువలో నుంచి ఇరువురిని బయటకు తీయగా అప్పటికే నాగరాజు మృతి చెందాడు. భార్గవి వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఇరువురి మధ్య కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 19న ఇరువురు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంతో భార్గవి భర్త ఫిర్యాదు మేరకు వినుకొండ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. మృతుడు నాగరాజు భార్య సువర్ణలత కుటుంబ మనస్పర్థలతో నాలుగు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. మృతునికి సంతానం లేక దత్తత తీసుకోవడం జరిగింది. ఇరువురు విడిపోతామనే భయంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి బాబాయి జి.లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండకు పోస్టుమార్టం నిమిత్తం తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు.



నాగరాజు(ఫైల్)

జనవరి 30న విజ్ఞాన్ ఫార్మసీలో అంతర్జాతీయ సదస్సు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో జనవరి 30వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస బాబు మంగళవారం తెలిపారు. అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసబాబు మాట్లాడుతూ 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్– ఏ ఫ్యూచరిస్టిక్ అప్రోచ్' అనే అంశంపై మూడు రోజుల పాటు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను 'నెక్స్‌జెన్ ఫార్మా కనెక్ట్–2025' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మోంటుకుమార్ ఎం.పటేల్, గౌరవ అతిథులుగా ఏపీ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్, న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్‌రెడ్డి, న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎం.వెంకటరమణ, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విల్లియం కారే హాజరవుతారని తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సీఈఓ డాక్టర్ జగదీష్ బాబు రంగిశెట్టి, గౌరవ అతిథులుగా హైదరాబాద్ బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో–ఫౌండర్ డాక్టర్ మానిక్ రెడ్డి పుల్లగుర్ల, హైదరాబాద్ జెనరా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ ఆరుట్ల హాజరవుతారని తెలిపారు. చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యతో పాటు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస బాబు, డీన్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య, ప్రిన్సిపాల్ శ్రీనివాసబాబు